వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యేలు

దంపతులను ఆశీర్వదిస్తున్న మాజీ ఎమ్మెల్యే సురేందర్, నాయకులు

నాగిరెడ్డిపేట, మే 30 : మండలంలోని పలు గ్రామాల్లో జరిగిన కల్యాణాలకు మాజీ ఎమ్మెల్యేలు జాజాల సురేందర్, జనార్దన్‌గౌడ్ హాజరై నూతన వధూమరులను ఆశీర్వదించారు. మాల్తుమ్మెద గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ ఈటెల నారాయణ సోదరుడి కూతురు వివాహానికి హాజరై దంపతులను ఆశీర్వదించారు. పోచారం గ్రామానికి చెందిన కలాలి అశోక్‌గౌడ్ కూతురు, లింగంపేట మండలం బోనాల మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకుడు రవీందర్‌గౌడ్ కుమారుడి పెండ్లికి హాజరై దంపతులను ఆశీర్వదించారు.

విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

బోర్లం క్యాంపులో మాట్లాడుతున్న ఎంపీడీవో ముజాహిద్

బాన్సువాడ రూరల్, మే 30 : తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ఎంపీడీవో ముజాహిద్ గ్రామస్తులకు సూచించారు. బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపులోని గ్రామ పంచాయతీ భవనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన బడిబాట సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు మంచి విద్య అందాలంటే ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని సూచించారు. ఈ నెల 6 నుంచి చేపట్టే బడిబాట కార్యక్రమంలో గ్రామస్తులందరూ భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణ, గ్రామ పంచాయతీ కార్యదర్శి పరిపూర్ణ, యువజన సంఘం అధ్యక్షుడు విష్ణు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మాపూర్‌లో బడిబాట..

విద్యార్థుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న లక్ష్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాళ్లు

ఎల్లారెడ్డి రూరల్, మే 30 : పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించి నాణ్యమైన విద్య అందేలా చూడాలని ఉపాధ్యాయురాలు సంతోషి అన్నారు. ఎల్లారెడ్డి మండలం లక్ష్మాపూర్ గ్రామ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాళ్లు శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాల ప్రాధాన్యతను వివరించారు. ప్రభుత్వ పాఠశాలలో ఏకరూప దుస్తులతోపాటు పుస్తకాలు, నోట్‌బుక్స్ ఉచితంగా ఇస్తారని తెలిపారు. క్వాలిఫైడ్ ఉపాధ్యాయులతో విద్యాబోధన జరుగుతుందన్నారు. ఈకేఎస్‌టీఈపీ సహకారంతో ప్రభుత్వ పాఠశాలల్లో కృత్రిమ మేధస్సు ఇంటిగ్రేటెడ్ లెర్నింగ్, తెలుగు, ఆంగ్ల పఠనం, గణిత నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి సారించి డిజిటల్ లెర్నింగ్ ప్లాట్‌ఫాంల ద్వారా విద్యాబోధన జరుగుతుందన్నారు. లక్ష్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు కవిత, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

బీర్కూర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో చంద్రశేఖర్

నస్రుల్లాబాద్, మే 30 : ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ అన్నారు. బీర్కూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలుపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా స్టాక్, రోగుల రిజిస్టర్లు, అన్ని గదులు, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీలేఖ, గిరీశ్, సీహెచ్‌వో రవీందర్, స్టాఫ్ నర్సు మహమ్మది, నర్సమ్మ, ఎల్‌టీ విఠల్ ఉన్నారు.

అర్ధాంతరంగా నిలిచిన పనులు

- రోడ్డుపై ప్రమాదకరంగా మారిన గుంతలు
- దుమ్మూధూళితో రోగాల బారిన పడుతున్న జనం
- చోద్యం చూస్తున్న అధికారులు

బిచ్కుందలో సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టడంతో లేస్తున్న దుమ్ము

బిచ్కుంద, మే 30 : మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్, రోడ్డు విస్తరణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రెండు నెలల నుంచి పనులు సాగడం లేదు. దీంతో నిత్యం ఈ రోడ్డు గుండా రాకపోకలు సాగిస్తున్న వాహనదారులు, ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. తరచుగా ప్రమాదాలు జరగడంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని వాహనదారులు ఆందోళనకు గురవుతున్నారు. బిచ్కుంద మండల కేంద్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రోడ్డు విస్తరణ పనులకు అనుమతులు వచ్చాయి. రెండు కిలోమీటర్ల పనులు చేపట్టేందుకు రూ.12 కోట్లను మంజూరు చేశారు. ఈ రోడ్డు విస్తరణ పనులకు అప్పటి ఎమ్మెల్యే హన్మంత్ షిండే స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేశారు. అప్పటి నుంచి పనులు ముందుకు సాగడం లేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆర్ అండ్ బీ అధికారులు రోడ్డు పనులను ప్రారంభించారు. గంతలు తీసి వదిలేశారు. ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికలు రావడంతో పనులు నిలిచి పోయాయి. జుక్కల్ ఎమ్మెల్యేగా గెలిచిన తోట లక్ష్మీకాంతారావు పనుల విషయమై అధికారులతో మాట్లాడారు. కొత్త టెండర్లకు ఆహ్వానించి అవే పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ప్రధాన రహదారికి రెండు కిలోమీటర్ల వరకు రోడ్డు విస్తరించి మధ్యలో డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. రోడ్డుకు ఆనుకొని ఉన్న ఇండ్లను రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చి వేశారు. రోడ్డుకు ఇరువైపులా మురికి కాలువలు తవ్వారు. రెండు నెలలుగా రోడ్డు విస్తరణ పనులు ఆగిపోవడంతో మురికి కాలువల నిర్మాణం కోసం తవ్విన మట్టిని రోడ్డుకు ఇరువైపులా పోశారు. దీంతో వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి లేచి రోడ్డు వెంట చిరువ్యాపారులతోపాటు దుకాణదారులు, ప్రజలు శ్వాస కోస సమస్యల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజుల నుంచి అకాల వర్షం పడుతుండడంలో మురికి కాలువల్లోని నీరు రోడ్డుపై పారడంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులకు గురి అవుతున్నారు. చిన్న పాటి వర్షానికే పరిస్థితి ఇలా ఉంటే వచ్చే వర్షాకాలంలో పరిస్థితి దారుణంగా మారుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులను త్వరగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుకు ఇరువైపులా నిలిచిపోయిన మురికి కాలువ పనులు

దుమ్ముతో తీవ్ర ఇబ్బందులు..

సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువల కోసం తవ్విన మట్టిని రోడ్డుకు ఇరువైపులా పోయడంతో వాహనాల రాక పోకలతో విపరీతమైన దుమ్ము వస్తున్నది. వ్యాపారస్తులతోపాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలువురికి శ్వాసకోస, కంటి సమస్యల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దుమ్ము లేవకుండా రహదారిపై నీళ్లు చల్లాలని అధికారులకు పలు మార్లు విన్నవించుకున్నా నామమాత్రంగా పనులు చేపడుతున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా మురికి కాలువల నిర్మాణ పనులు..

రోడ్డుకు ఇరువైపులా నిర్మిస్తున్న మురికి కాలువల పనులు అస్తవ్యస్తంగా కొనసాగుతున్నాయి. అధికారుల ఉదాసీనత ప్రజలకు కష్టాలను తెచ్చి పెడుతున్నాయి. మురుగు కాలువల పనులు అష్ట వంకరలు తిరుగుతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో దుకాణదారులతోపాటు ఇంటి యజమానులు మురికి కాలువలపై స్లాబ్‌లను నిర్మించుకొంటున్నారు.

వ్యాధుల బారిన పడుతున్నాం

బస్టాండ్ సమీపంలో తనకు ఫెర్టిలైజర్ దుకాణం ఉంది. సెంట్రల్ లైటింగ్ పేరిట రోడ్డుకు ఇరువైపుల మురికి కాలువలను తవ్వారు. వాటిపై స్లాబులు వేయక పోవడంతో దుకాణానికి వచ్చే కొనుగోలుదారులు మురికి కాలువలో పడి గాయాలపాలవుతున్నారు. రోడుపై వెళ్లే వాహనాలతో దుమ్ము, దూళి లేవడంతో దుకాణంలో కూర్చోలేక పోతున్నాం. దీంతో శ్వాస కోస వ్యాధుల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి త్వరగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలి.

- సంజు, వ్యాపారస్తుడు

వ్యాపారం చేసుకోలేక పోతున్నాం

నేను కర్ణాటక నుంచి బతుకుదెరువు కోసం బిచ్కుందకు వచ్చాను. బస్టాండ్ సమీపంలో రోడ్డు పక్కన టీ స్టాల్ నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. ఏడాది క్రితం సెంట్రల్ లైటింగ్ పేరిట రోడ్డును తవ్వారు. దుమ్ము అధికంగా వస్తున్నది. వ్యాపారం చేసుకోలేక పోతున్నాం. అధికారులు స్పందించి త్వరగా రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి.

- రాజు, టీకొట్టు వ్యాపారి

నో టీసులు జారీ చేశాం

14 నెలల క్రితం రోడ్డు విస్తరణ పనులతోపాటు రోడ్డుకు ఇరువైపులా మురికి కాలువల పనులు చేపట్టాం. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో సంబంధిత కాంట్రాక్టర్ రెండు నెలలుగా పనులు నిలిపివేశాడు. బిల్లులు వచ్చేవరకు పనులు చేపట్టనన్నాడు. కాంట్రాక్టర్‌కు పనులు పూర్తి చేయాలని నోటీసులు జారీ చేశాం. స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడి పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

- కిషన్, ఆర్‌అండ్‌బీ డీఈ

నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు

జుక్కల్‌లో విత్తనాలు, పురుగు మందుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

బిచ్కుంద(జుక్కల్), మే 30 : నకిలీ విత్తనాలు విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని బిచ్కుంద ఏడీఏ అమినాబీ, ఎస్సై భువనేశ్వర్ ఫెర్టిలైజర్ దుకాణల యజమానులకు హెచ్చరించారు. జుక్కల్ మండల కేంద్రంలో విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో పోలీస్ శాఖ అధికారుల సమన్వయంతో టాస్క్‌ఫోర్స్ బృందంగా ఏర్పడి శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. విత్తన బస్తాలు, ఎరువులను తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనలు పాటించి ఎరువులు, విత్తనాలు విక్రయించాలన్నారు. రైతులకు రశీదు తప్పనిసరి ఇవ్వాలని సూచించారు. నాసిరకమైన విత్తనాలు విక్రయిస్తే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. వారి వెంట నిజాంసాగర్ ఏవో అమర్ ప్రసాద్, పోలీస్ సిబ్బంది, దుకాణాల యజమానులు వాసర్‌వార్ రమేశ్, దత్తు పటేల్ తదితరులు ఉన్నారు.

ఉపకార వేతనాలకు గడువు పొడిగింపు

కామారెడ్డి, మే 30 : జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, డిసాబుల్డ్ విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరానికి అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలలోని అర్హులైన విద్యార్థుల ఉపకార వేతనాల గడువు జూన్ 30వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి రిజత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఫ్రెష్, రెన్యూవల్ ఉపకార వేతనం కోసం http://telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

అల్మాజీపూర్ గ్రామంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్న ఏఈవో రవీందర్

ఎల్లారెడ్డి రూరల్, మే 30 : రైతులకు ప్రభుత్వం ప్రకటించే పథకాల లబ్ధి పొందాలంటే ప్రతి రైతూ తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకొని 11 అంకెల గుర్తింపు సంఖ్యను తీసుకోవాలన్నారు. ఎల్లారెడ్డి మండలం అల్మాజీపూర్ గ్రామంలో ఆయన శుక్రవారం ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. రైతులు రాయితీపై డ్రిప్, తుంపర్ల సేద్యం పరికరాలు కావాలన్నా సమీపంలోని ఏఈవో వద్దకు వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు.

నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలి

కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

లింగంపేట్‌లో నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

లింగంపేట్, మే 30 : ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరగా ప్రారంభించి.. పూర్తి చేసుకోవాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. లింగంపేట్ మండల కేంద్రంలో ఆయన ఇందిరమ్మ ఇండ్లకు శుక్రవారం మార్కింగ్ చేసి పనులను ప్రారంభించారు. ప్రభుత్వం విడుతలవారీగా డబ్బులను ఖాతాలో జమ చేస్తుందన్నారు. లబ్ధిదారులు ఇంటి పనులు ఆపకుండా త్వరితగతిగ పూర్తి చేయాలని సూచించారు. అనంతరం ఆయన మండల కేంద్రంలో శానిటేషన్ పనులను పరిశీలించి ఎంపీడీవో, సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట డీఆర్‌డీవో సురేందర్, హౌసింగ్ పీడీ, డీపీవో శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో నరేశ్, ఎంపీవో మల్లరీ, ఏపీఎం శ్రీనివాస్, పంచాయతీ సెక్రటరీ శ్రవణ్‌కుమార్ తదితరులున్నారు.

అర్హులైన వారికే ఇందిరమ్మ ఇండ్లు

బాన్సువాడ రూరల్, మే 30 : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపు తండా గ్రామంలో శుక్రవారం రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజు, లబ్ధిదారులు, అధికారులతో కలిసి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో డీఎల్‌పీవో సత్యనారాయణరెడ్డి, ఎంపీడీవో ముజాహిద్, హౌసింగ్ డీఈ గోపాల్, గ్రామ పంచాయతీ కార్యదర్శి పరిపూర్ణ, గ్రామస్తులు పీర్యానాయక్, సంజీవ్‌రెడ్డి, బింగి శ్రీనివాస్, శ్రీశైలం, శ్రీనివాస్‌రెడ్డి, నెర్రె నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీల అందజేత

బీబీపేట్, మే 30 : బీబీపేట, దోమకొండ మండల కేంద్రాలతోపాటు ఆయా గ్రామాల్లో నాయకులు, అధికారులు కలిసి శుక్రవారం ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గుపోశారు. బీబీపేటలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్ కాపీలను అందజేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు రమేశ్, పాత రాజు, భూమాగౌడ్, పంచాయతీ కార్యదర్శి రమేశ్, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మేలకుంట తండాలో..

నాగిరెడ్డిపేట, మే30 : పారిశుద్ధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టాలని డీఎల్పీవో సురేందర్ పంచాయతీ కార్యదర్శి ప్రవితకు సూచించారు. నాగిరెడ్డిపేట మండలంలోని మేలకుంట తండా గ్రామ పంచాయతీని ఆయన శుక్రవారం సందర్శించారు. గ్రామంలో 11 ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకాగా ప్రారంభించిన ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పనులు చేపట్టాలని లబ్దిదారులకు సూచించారు. తండాలో తిరిగి మురుగుకాలువలు, రోడ్లను పరిశీలించారు. వాటర్ ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. తాగునీటి సరఫరా అవుతున్న పైప్‌లైన్‌లు లీకేజీలు లేకుండా చూసుకోవాలని చెప్పారు. జీపీ రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ వసురాంనాయక్ తదితరులు ఉన్నారు.

బోర్లం క్యాంపులో ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న రాష్ట్ర వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాసరెడ్డి

పంచముఖి ఆలయ నూతన కమిటీ ఎన్నిక

కామారెడ్డి, మే 30 : జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్ ఆలయ నూతన కమిటీకి ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ నియామక పత్రాలను శుక్రవారం అందజేశారు. ఆలయ కమిటీ చైర్మన్‌గా వైద్యకిషన్‌రావు, డైరెక్టర్లుగా భీమ్ రాజ్, దాసోజు శ్రీనివాస్, గంగమని, శంకరయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో డీసీసీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా షేక్ ఖయ్యూం

మున్సిపల్ కమిషనర్‌ను సన్మానిస్తున్న సిబ్బంది

బిచ్కుంద, మే 30 : బిచ్కుంద మున్సిపల్ కమిషనర్‌గా షేక్ ఖయ్యూం శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆర్మూర్ మున్సిపాలిటీ నుంచి బిచ్కుందకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల సిబ్బంది ఆయనకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సిబ్బంది వీరేశం, మహేశ్, నాయకులు తుకారాం, ఖలీల్, సీమ గంగారాం తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

లింగంపేట్(తాడ్వాయి), మే 30 : ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన తాడ్వాయి మండలంలోని కృష్ణాజివాడి గ్రామం లో చోటు చేసుకున్నట్లు ఎస్సై మురళి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి సాయిలు(60) గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ చేనులో శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం మృతదేహాన్ని కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మురళి తెలిపారు.

ఎల్లయ్య చెరువు వద్ద వ్యక్తి మృతదేహం లభ్యం

బాన్సువాడ, మే 30 : పట్టణంలోని ఎల్లయ్య చెరువు వద్ద వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో అశోక్ శుక్రవారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో తెలిపిన వివరాల ప్రకారం.. బాన్సువాడ దవాఖానలో శానిటైజర్ వర్కర్‌గా తలసరి శ్రీనివాస్(53) పని చేస్తున్నాడు. ఎల్లారెడ్డి నుంచి బాన్సువాడకు గురువారం డ్యూటీ నిమిత్తం వచ్చాడు. డ్యూటీ తర్వాత తిరిగి ఇంటికి వెళ్లలేడు. శుక్రవారం పట్టణంలోని ఎల్లయ్య చెరువు వద్ద వ్యకి మృతదేహం ఉందని 100కు సమాచారం వచ్చింది. పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. దవాఖాన సిబ్బందిని పిలువగా మృతదేహం శ్రీనివాస్‌దేనని గుర్తించారు. మృతదేహాన్ని బాన్సువాడ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మురికి కాలువలో పడి వ్యక్తి మృతి

బిచ్కుంద, మే 30 : కాలు జారి మురికి కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన బిచ్కుందలో చోటు చేసుకున్నది. ఎస్సై మోహన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బిచ్కుందకు చెందిన షక్కర్గ లక్ష్మణ్(37) కూలీ పని చేసుకుంటు జీవనం కొన సాగిస్తున్నాడు. గత బుధవారం పట్టణంలోని వార సంతలో కూలీ పని చేసుకొని ఇంటికి తిరిగి రాలేదు. అంగడిలో కూలీ పని ముగించుకొని మద్యం తాగి కోలావార్ రైస్ మిల్ పక్కనుంచి ఇంటికి నడుచుకుంటు వస్తున్నాడు. రైస్ మిల్ కాంపౌండ్ పక్కనున్న మురికి కాలువలో ప్రమాదవశాత్తు కాలు జారి పడిపోయి ఊపిరాడక మృతిచెందాడు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, MANTHENA SUJATHA (Old Name) W/o. MANTHENA SHIVA PRASAD R/o. H.No.4-30/4, Mentrajpally (V), Dichpally (M), Nizamabad (Dist.), I have change my Name as MANTHENA KAVITHA DEVI (New Name)

NTZ-338450

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ 4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే. ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

వివరాలు సేకరిస్తున్న ఎస్సై రాజు

పెద్ద కొడప్‌గల్ (పిట్లం), మే 30 : తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగిన ఘటన పిట్లం మండల కేంద్రంలో చోటుచేసుకున్నది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లంలో శుక్రవారం తెల్లవారు జామున 3 గంటల సమయంలో యూనియన్ బ్యాంక్ వెనుకాల ఉన్న చాకలి బాలరాజ్, ఎండి.మెహబూబ్, చాకలి రామేశ్, సినిమా థియేటర్ వెనుకాల ఉన్న చాకలి లక్ష్మి ఇంటి తాళాలను దొంగలు పగులగొట్టారు. ఇండ్లల్లోకి చొరబడి బీరువాల నుంచి బంగారు, వెండి ఆభరణాలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మొరం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు

బిచ్కుంద, మే 30 : అనుమతులు లేకుండా మొరం అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని మైనింగ్ ఏడీ నగేశ్ హెచ్చరించారు. బిచ్కుందలో వారం రోజులుగా మైనింగ్ శాఖ ద్వారా అనుమతులు ఒక చోటపొంది మరో చోట మొరం తవ్వకాలు చేపడుతున్నారన్న సమాచారంతో రెవెన్యు అధికారులు ఒక జేసీబీ, ఆరు ట్రాక్టర్లను సీజ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం మైనింగ్ ఏడీ నగేశ్ మండల కేంద్రంలోని మొరం తవ్వకాలు జరిపిన ప్రదేశానికి వెళ్లి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతులు లేకుండ మొరం అక్రమంగా తరలిస్తే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతకుముందు మండలంలోని ఖత్‌గావ్, షెట్లూర్, గుండే నమ్లి గ్రామాల మంజీరా పారీవాహక ప్రాంతాల్లో ఇసుక క్వారీలను రెవెన్యూ, నీటిపారుదల, భూగర్భ జలవనరుల, మైనింగ్ శాఖల అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ రవీంద్రనాథ్, ఆయా శాఖల అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరలు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ శిబిరం

జర్మనీ, బెల్జియం నుంచి వచ్చి ముగ్గురు కరాటే మాస్టర్లతో దోమకొండ కరాటే మాస్టర్లు

బీబీపేట్(దోమకొండ), మే 30 : దోమకొండ మండల కేంద్రంలో అంతర్జాతీయ కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండురోజులు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ ప్రెసిడెంట్ కామిడ్ల రాజయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో జర్మనీ, బెల్జియం దేశాల నుంచి ముగ్గురు గ్రాండ్ మాస్టర్లు హనిష పీటర్ హార్న్స్ (బ్లాక్ బెల్ట్ 10డాన్), షిహాన్ పోల్ స్టోజ్లెట్ (బ్లాక్ బెల్ట్ 6డాన్), షిహాన్ రెయిన్‌హార్న్స్ (బ్లాక్ బెల్ట్ 6డాన్)తో 155 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ బ్లాక్ బెల్ట్ మాస్టర్ కమిండ్ల నవీన్, జనరల్ సెక్రటరీ స్వామి, సాయినాథ్‌గౌడ్, సంతోష్, లక్ష్మీనర్సు, సిద్దరాములు, కుమార్, స్వాతిక్, రోహిత్, హరిప్రసాద్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.